# బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



హోంగార్డు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, నవంబర్ 2 : ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన హోంగార్డ్ అధికారి సంతోష్ కుటుంబ సభ్యులకు గురువారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడి ఫైనాన్సియల్ హెడ్ ఫండ్ కింద చెక్ అందించారు. బాధిత కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. వీరి వెంట అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**ఉలన్ జాకెట్ల పంపిణీ..**

శీతాకాలం సందర్భంగా వికారాబాద్ ఎస్పీ పోలీస్ సిబ్బందికి ఉలన్ జాకెట్‌లను గురువారం ఎస్పీ కార్యాలంయలో పంపిణీ చేశారు. ఎస్పీ వెంట పోలీస్ అధికారులు వీరేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్



మహేశ్వరం, నవంబర్ 2 : మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతిహోళీకేరి గురువారం సందర్శించారు. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో ఏర్పాట్లను పరిశీలించారు. నేమినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్లు, మహమూద్‌అలీ, గోపాల్, డిప్యూటీ తహసీల్దార్లు నవత, శేఖర్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- కారు గుర్తుకు ఓటు వేయండి
- సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చండి
- కట్టమైసమ్మ ఆలయంలో పూజలు
- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి సబితాఇంద్రారెడ్డి
- ప్రచార రథాలను ప్రారంభించిన మంత్రి




లెనిన్‌నగర్ ప్రశాంత్ హిల్స్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 2 : అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని విద్యాశాఖ మంత్రి పటోళ్ళ సబితాఇంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ కట్టమైసమ్మ ఆలయంలో మంత్రి పూజలు చేసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాలను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ఓటర్లకు అందజేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు మంత్రి వివరించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి గడపకూ అందించిందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కోట్ల రూపాయలతో లెనిన్‌నగర్‌లో ముంపు సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎన్‌డీపీ నిధులతో నాలాలను అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేయాలన్నారు. మరోసారి అవకాశం ఇస్తే పెండింగ్ పనులను పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటానని మంత్రి ప్రజలకు వాగ్దానం చేశారు. మాయ మాటలు చెప్పే వారి మాటలను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, అనిల్‌కుమార్‌యాదవ్, వేముల నర్సింహ, పవన్‌కుమార్ యాదవ్, లావణ్య, అర్కట భూపాల్ రెడ్డి, రవినాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, భూపేష్‌గౌడ్, జంగయ్య, శ్రీనునాయక్, బండి మీన నగేశ్, రమేశ్ ఉన్నారు.

# ఎన్నికలకు పటిష్టమైన భద్రత

**రాచకొండ సీపీ చౌహాన్**

ఇబ్రహీంపట్నం/యాచారం, నవంబర్ 2 : త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతను కల్పించనున్నట్లు రాచకొండ సీపీ డీ.ఎస్ చౌహాన్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని చెరువుకట్టపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, యాచారం మండలంలోని మాల్ చెక్‌పోస్టుతో పాటు, పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. చెక్‌పోస్టు నిర్వహిస్తున్న తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల వద్ద చేపట్టాల్సిన విధులను వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల భద్రతపై పోలీసులకు అవగాహన కల్పించారు. ఎన్నికలకు సంబంధించిన నిర్దిష్టమైన సలహాలు, సూచనలను పోలీసు సిబ్బందికి వివరించారు. నల్లగొండ-రంగారెడ్డి సరిహద్దు ప్రాంతమైన మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను సైతం స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచకొండ పరిధిలో మొత్తం 24చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందిగా తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బులు, మద్యంపై ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. రాచకొండ పరిధిలో ఇప్పటి వరకు రూ.40కోట్ల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల దృష్టా 90మంది నేరస్తులను ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు సమర్థవంతంగా, నిబద్ధతతో తమ విధులను నిర్వహించాలన్నారు. అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుకూలంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నియమాళిని ఉల్లఘించిన వారిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాచకొండ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పూర్తి స్థాయిలో భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద పీటీజీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగదును జప్తు చేసే విషయంలో తగిన రీతిలో పంచనామా చేసి తగిన ఆధారాలు చూపించిన వారికి నగదును తిరిగి చెల్లించే వెసులుబాటు ఉందని ప్రజలకు వివరించాలని కోరారు. రాచకొండ పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, యాచారం మండల సీఐ సైదయ్య, ఎస్ఐ వెంకటనారాయణ, ఇబ్రహీంపట్నం సీఐ గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.



యాచారం : నిఘా సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ చౌహాన్

# నామినేషన్ల ప్రక్రియ పడక్బందీగా చేపట్టాలి

**రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**



చేవెళ్లలో నామినేషన్ల ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

షాబాద్, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లు, నిబంధనలు తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం విద్యావికాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఆమె వెంట చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం, సిబ్బంది తదితరులున్నారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికాదు

**రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ ఆరోపణలు**

**మూడు సంవత్సరాల క్రితం చనిపోయిన రైతు కుటుంబం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా..?**

**కుట్ర రాజకీయాలు చేస్తే తెలంగాణ ప్రజలు తరిమికొడతారు**

**కాంగ్రెస్ పార్టీ నేతల తీరుపై నిప్పులు చెరిగిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

కల్వకుర్తి, నవంబర్ 2 : రాజకీయ లబ్ధి కోసం రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచార కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి వచ్చిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను గురువారం కల్వకుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఖండించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడారు. జిల్లెల్ల గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం రైతు ఎగిరిశెట్టి చంద్రయ్య ఆత్మహత్య చేసుకుని మరణించాడు. గతంలో రెండుసార్లు చంద్రయ్య ఆత్మహత్య ప్రయత్నాలు చేశాడు. దురదృష్టవశాత్తు మూడోసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాలు కోల్పోయాడు. చంద్రయ్యకు 28గుంటల పొలం ఉంది, రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. వ్యక్తిగత కారణాలతో చంద్రయ్య చనిపోతే మూడు సంవత్సరాల తరువాత కాంగ్రెస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అప్పుల బాధతో చనిపోయాడని రాజకీయాలు చేస్తారా అంటూ ఎమ్మెల్యే మండిపడ్డారు. చంద్రయ్య చనిపోయిన వారం రోజుల వ్యవధిలోనే బాధిత కుటుంబానికి రూ.5లక్షల రైతుబీమా వచ్చింది. చంద్రయ్య భార్య తిరుపతమ్మకు వితంతు పింఛన్ మంజూరైంది. మూడు సంవత్సరాలుగా చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించని ఏఐసీసీ, పీసీసీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి పది పైసలు కూడా సాయం అందించని కాంగ్రెస్ వాళ్లు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తారా అని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలు కనిపించడం లేదా, కళ్ళుండి చూడలేని గుడ్డివాళ్లు అంటూ కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్యే దుమ్మెత్తిపోశారు. భారతదేశ అభివృద్ధిని అడ్డుకున్న ద్రోహుల పార్టీ కాంగ్రెస్ అని, ఇలాంటి పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌పై అవాకులు చవాకులు పేలితే సహించమన్నారు.

**విలువల్లేని వ్యక్తి రాహుల్‌గాంధీ..**

సాంప్రదాయం, సిద్దాంతమంటూ లేకుండా నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి కుటుంబాల విలువ ఏం తెలుసని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వసుందని కలలు కంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బులతో బీఆర్‌ఎస్ నాయకులను కొనుగోలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ విజయాన్ని ఏశక్తి అడ్డుకోలేదని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్దన్, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్ రావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు జంగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలయ్య చెన్నకేశవులు, కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్